లక్ష మందికి విందు.. చెరుకువాడ రికార్డు

- ఆచంట నియోజకవర్గంలో అట్టహాసంగా 'ఆసరా' కార్యక్రమం నిర్వహణ
- మహిళలకు చీర, సారె పెట్టిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


తూర్పుపాలెంలో ఆత్మీయ విందులో మహిళలకు వడ్డిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు (ఫైల్ ఫొటో)

పెనుగొండ: దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని రీతిలో ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సుమారు లక్ష మందికి ఆత్మీయ విందునిచ్చి రికార్డు నెలకొల్పారు. ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక ఇబ్బందులు చూసి డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరాతో పూర్తిగా రుణమాఫీ చేయగా, ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు మహిళలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలపడానికి వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మూడవ విడతలో ఆయా మండలాల్లో నిర్వహించిన ఆసరా సంబరాల్లో నాల్గో విడత రుణమాఫీ నగదు జమ చేసినప్పుడు మహిళలకు చీర, సారె పెడతానంటూ ప్రకటించారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం తరపున చేపట్టే ఆసరా సంబరాలను తూర్పుపాలెంలోని కార్యాలయం వద్ద 'ఆసరా.. మనసారా' పేరిట అత్యంత ప్రతిష్టాత్మకంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు 10 రోజుల పాటు నిర్వహించారు. ప్రతి రోజూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల నుంచి సంబరాలకు హాజరయ్యేలా నిత్యం 520 గ్రూపుల్లోని డ్వాక్రా మహిళలకు ఆత్మీయ విందుతో పాటు, వారికి చీరలు పంపిణీ చేసి ఇచ్చిన మాట నిలుపుకున్నారు. డ్వాక్రా గ్రూపుల నుంచి వచ్చే 5,200 మంది మహిళలతో పాటు వారి బంధువులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలూ కలిపి సుమారు 10 వేల మందికి నిత్యం ఆత్మీయ విందునిచ్చారు.

మిగిలిన మహిళలకు చీర, సారె

కాగా, డ్వాక్రా మహిళలు కాకుండా నియోజకవర్గంలో మరో 38 వేల మంది మహిళలు ఉండటంతో మహిళల కోరిక మేరకు వారి ఇంటి వద్దకే చీర, సారె పంపే ఏర్పాట్లను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చేయడంతో మహిళల ఆనందానికి అవధులు లేవు.

మహిళలకు కృతజ్ఞతలు

10 రోజుల పాటు 'మనసారా.. ఆసరా' సంబరాల్లో పాల్గొన్న సుమారు 60 వేల మంది మహిళలకు శ్రీరంగనాథరాజు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విధాలా అండగా నిలిచి సంబరాలు విజయవంతం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, మహిళలకు ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక 23వ వార్డుకు చెందిన షేక్ ధర్ హిమామ్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.80 వేల చెక్కును అందజేసి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతూ అప్పులు చేసుకుని వైద్యం చేయించుకున్న రోగులకు సీఎం సహాయ నిధి కొంత ఆర్థిక ఊరటనిస్తుందన్నారు. కార్యక్రమంలో తిల్లపూడి సర్పంచ్ నడపన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుమంట్రలో వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం


ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఇర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ఆర్‌బీఎం సత్యనారాయణ

పెనుమంట్ర: పెనుమంట్ర పంచాయతీ కార్యాలయం వద్ద రూ.4.30 లక్షలతో ఇర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా కంపెనీ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, సంస్థ ఆర్‌బీఎం ముత్యాల సత్యనారాయణ శుక్రవారం పునఃప్రారంభించారు. 2009లో రాజు వేగేశ్న ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు, చాలా కాలం గ్రామస్తులకు ఉచిత రక్షిత మంచినీటిని అందించిన ఈ ప్లాంట్ టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ప్లాంట్‌లో మిషనరీ పూర్తిగా పాడవ్వడంతో ఇర్బాక్ సంస్థ ముందుకు వచ్చి రూ.3.30 లక్షలు విరాళంగా అందజేయడంతో మరో లక్ష గ్రామ పంచాయతీ వెచ్చించి గ్రామస్తులకు ఉచితంగా మంచినీటిని సరఫరా చేసేందుకు కొత్త మిషనరీని ఏర్పాటు చేశారు.

రాజీవ్ కాలనీకి కమ్యూనిటీ హాళ్లు

పెనుమంట్ర రాజీవ్ కాలనీలో రూ.15 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ.10 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని శుక్రవారం ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. ఈనెల 14వ తేదీలోగా రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభిస్తామని ఎస్సీ, బీసీ నాయీ బ్రాహ్మణ సంఘాల నాయకులకు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక ప్రసన్న, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, యువజన విభాగం మండలాధ్యక్షుడు కొవ్వూరి నాగమోహన రాజారెడ్డి, మాముడూరు, గరువు, జుత్తిగ సర్పంచ్‌లు గూడూరి దేవేంద్రుడు, ముదునూరి నాగరాజు, తమనంపూడి వీర్రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దాట్ల చంటిరాజు, మాజీ అధ్యక్షుడు తేతలి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి చిన్నబ్బాయి, గండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్

నరసాపురం: వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నరసాపురం అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక క్లాత్ మర్చంట్స్ హాల్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. వెట్టిచాకిరీ ఏ రూపంలో చేయించుకున్నా చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోకూడదని చెప్పారు. వ్యాపారులు దృష్టిపెడితే వెట్టిచాకిరీ, బాల కార్మిక వ్యవస్థ రెండిటినీ రూపుమాపవచ్చన్నారు. నరసాపురం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆకన లక్ష్మి వెట్టిచాకిరీ చేయిస్తే చట్టపరంగా తీసుకునే చర్యలపై వ్యాపారులకు అవగాహన కలిగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్య నాయుడు, సీనియర్ న్యాయవాది నారిన శ్రీనివాస్, న్యాయవాది నక్కా ఆనంద్‌బాబు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేఆర్‌బీ శర్మ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమూ అవసరమే


సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో అవసరమని న్యూరో సైక్రియాటిస్ట్ డాక్టర్ బి.స్పందన అన్నారు. శుక్రవారం స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో మానసిక ఆరోగ్యం.. మానవాభివృద్ధికి మూలం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ స్పందన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా విద్యార్థులు సోషల్ మీడియా, చెడు వ్యసనాలకు లోనుకావడం వల్ల శారీరక సమస్యల ద్వారా మానసికంగా కూడా అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులపై వాటికి దూరంగా ఉండాలంటే తప్పనిసరిగా యోగా, మెడిటేషన్, నడక, నలుగురిలో కూర్చున్నప్పుడు విద్యాభ్యాసంపై చర్చలు, కుటుంబ సంబంధాలు మెరుగు పరుచుకోవడం, గ్రంథ పఠనం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, సెక్రటరీ కె.రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, బి.విజయలక్ష్మి, టి.దేవి ప్రశాంతి, నాగ ప్రసన్న, రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలను మట్టుబెట్టకపోతే పంట దిగుబడిపై ప్రభావం

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలలలోని యనమదుర్రు గ్రామంలో శుక్రవారం నూకలు, నూనెతో కలిపిన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎలుకలను నిర్మూలించకపోతే పంటపై తీవ్ర చూపుతాయన్నారు. ఆయకట్టు రైతులందరూ ఒకేసారి తెరుచుకున్న ఎలుకల బొరియలు వద్ద మందు కలిపిన పొట్లంను పెడితే అవి తిని మృత్యువాత చెందుతాయన్నారు. ఒకరు పెట్టి మరొకరు పెట్టకపోతే ఎలుకలన్నీ మందు పెట్టని పొలం వద్దకు వెళ్లి వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, వీఈఏ వంశీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో సత్ఫలితాలు


మొగల్తూరు: రామన్నపాలెంలో ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బాబులు


పెనుగొండ: పెనుగొండలో రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు

మొగల్తూరు: ఎలుకల నిర్మూలనకు ఉపయోగించే బ్రోమోడయోలిన్ మందును పంట కాలమంతా వాడటం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కంచర్ల బాబులు సూచించారు. మండలంలోని రామన్నపాలెం గ్రామంలో శుక్రవారం బ్రోమోడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఎలుకల నిర్మూలన ఉద్యమ రూపంలో సామూహికంగా పంట లేని సమయంలో చేపడితే వాటి సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ అనిల్ కుమారి, ఏవో అబ్దుల్ రహీమ్, సర్పంచ్ బందెల ఏలిషా, వైఎస్సార్ సీపీ నాయకులు అయితం బాబులు, కరింశెట్టి రాంబాబు, అడ్డాల సాంబమూర్తి, సుబ్బారావు, యాతం చంటి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో సత్ఫలితాలు

పోడూరు: సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులకు సత్ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తెలిపారు. పోడూరు, కవిటం సచివాలయాల వద్ద రైతులకు ఎర పొట్లాలు పంపిణీ చేశారు. పోడూరులో వ్యవసాయాధికారితో పాటు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, కవిటంలో ఎంపీటీసీ కుక్కల సూర్యనారాయణ తదితరులు రైతులకు ఎర పొట్లాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకలతో పంటకు తీవ్ర నష్టం

పెనుగొండ: ఎలుకలు కారణంగా వరి సాగులో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీని వల్ల రైతులు నష్టాలకు గురవుతున్నారని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు అన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా శుక్రవారం పెనుగొండలో ఆయన రైతులకు పలు సూచనలు చేసి ఎరను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.స్పందన, కృష్ణకాంత్, ప్రియదర్శిని, ఆర్‌బీకే సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆచంట మండలంలో..

ఆచంట మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయోలిన్ మందు కలిపి విషపు ఎర తయారు చేయాలని రైతులకు సూచించారు. వీటిని 10 గ్రాములు మించకుండా చిన్న చిన్న పొట్లాలుగా చేసి ఎలుక బొరియల్లో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

పెనుమంట్ర: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టేందుకు రైతులకు నూకలు కలిపిన బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. మొత్తం 61 కిలోల మందును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారిణి ఎ.జ్యోష్న్యల మాట్లాడుతూ విషపు ఎరతో కూడిన 10 గ్రాముల మందును పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో వేసి పూడ్చడం ద్వారా పూర్తిస్థాయిలో ఎలుకల నిర్మూలన చేపట్టవచ్చని తెలిపారు. జుత్తిగ గ్రామంలో సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి ఎలుకల మందు పంపిణీ చేశారు.

ఎలుకల నిర్మూలనతో రైతులకు లాభం

యలమంచిలి: సామూహిక ఎలుకల నివారణతో రైతులకు అధిక లాభం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి సింగులూరి దేవి అన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె యలమంచిలి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎలుక జీవిత కాలం 12 నుంచి 18 నెలలు ఉంటుందన్నారు. అవి పుట్టిన మూడు నెలలు నుంచే సంతానోత్పత్తి ప్రారంభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్యపేట సర్పంచ్ మేడిది విజయ జ్ఞాన మణి, రైతులు దొంగ విజయ్‌కుమార్, మేడిది ఆనందరావు, తమ్మినీడి విష్ణుమూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు

ఆకివీడు: స్థానిక ఉప్పుటేరు వంతెన సమీపంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మోటార్ సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై బి.నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉంటున్న వాసుపల్లి శ్రీనివాసరావు గురువారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై ఆలపాడు వెళ్తుండగా వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు సాగి రామకృష్ణంరాజు వర్ధంతి సందర్భంగా శుక్రవారం కళాశాలలో రక్తదాన, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఒకేరోజు 140 యూనిట్ల రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. మ్యాక్స్ విజన్ కంటి వైద్యులు కళాశాల సిబ్బందికి ఉచితంగా వైద్య సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు.

నులిపురుగుల నివారణ తప్పనిసరి


మొగల్తూరులో విద్యార్థినితో ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న డాక్టర్ లక్ష్మీపార్వతి

మొగల్తూరు: పిల్లల్లో నులిపురుగుల నివారణకు తల్లిదండ్రులూ బాధ్యత వహించాలని మొగల్తూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ లక్ష్మీపార్వతి సూచించారు. స్థానిక నంబర్ 1 పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మరోసారి ఈనెల 16న మాత్రలు పంపిణీ చేస్తామని తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్, ఎంపీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్

పాలకొల్లు అర్బన్: ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా జీర్ణాశయంలోని నులిపురుగులు, ఏలిక పాములు, కొంకె పురుగులు, బద్దె పురుగులు విరోచనం ద్వారా బయటకు వచ్చి రక్తహీనత సమస్యలు తొలగిపోతాయని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ నవ్య జీవన్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లంకలకోడేరు, చింతపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో 1,078 మంది చిన్నారులకు, ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలోని 4,587 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, ఎంఈవో ఆర్‌ఎన్‌వీఎస్ గంగాధర శర్మ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పట్టణాధ్యక్షునిగా నరసింహారావు


గేదెల నరసింహారావు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పాలకొల్లు పట్టణాధ్యక్షునిగా స్థానిక బ్రాడీపేట 1వ వీధికి చెందిన గేదెల నరసింహారావును నియమించినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసింహారావును నియమించినట్లు చెప్పారు.

నేడు, రేపు పేరుపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరం

మొగల్తూరు: పేరుపాలెం గ్రామంలో శని, ఆదివారం రెండు రోజుల పాటు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన గన్నాబత్తుల వెంకట ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక గన్నాబత్తుల కల్యాణ వేదికలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎముకలు, స్త్రీ సంబంధిత వ్యాధుల వైద్య నిపుణులు సేవలందిస్తారని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన తహసీల్దార్ శివశంకర్

భీమవరం: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచిపేరు, గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన భీమవరం తహసీల్దార్ శివశంకర్, మద్యం డిపో సీఐ కల్యాణ చక్రవర్తి, టూటౌన్ ఎస్సై రమేష్ శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఏలూరుపాడులో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం


కాళ్ల: ఏలూరుపాడులో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు తెలిపారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.3 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో తూర్పు పేటలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసినట్లు ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు చెప్పారు. కార్యక్రమంలో మంతెన రామకృష్ణరాజు, వార్డు మెంబర్ గంటా చిన్న అమ్ములు, సచివాలయ కన్వీనర్లు కొండ రమణ, దాట్ల రామభద్రరాజు, బంద్రెడ్డి ఆది తదితరులు పాల్గొన్నారు.

తులసీదళం, చామంతి పుష్పాలతో బాబాకు పూజలు


బాబాకు పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 24వ వార్డులోని శ్రీ అభయ సాయి ధ్యాన మందిరం (మినీ షిర్డీ) 31వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాబాకు రుద్రాభిషేకాలు, తులసీదళం, చామంతి పుష్పాలతో విశేషార్చన నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు మహోత్సవాలు నిర్వహిస్తామని, 11న బాబాకు 22 ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం, అన్నదానం చేస్తామని, భక్తులందరూ పాల్గొనాలని మేనేజింగ్ ట్రస్టీ నిమ్మల శారదా సాయి, కార్యదర్శి అడబాల సాయిరామ కుమార్, కోశాధికారి శివకుమార్ కోరారు. అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


కొండేపూడిలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో అనూహ్య

పాలకోడేరు: మండలంలోని కొండేపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద గల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పాలకోడేరు ఎంపీడీవో టి అనూహ్య తనిఖీ చేశారు. ఒక కేంద్రంలో ర్యాంపు లేనట్లు గమనించి, దాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం ఎస్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఎ పోలయ్య, సచివాలయం కార్యదర్శులు మహాలక్ష్మి, రాపాక నరేష్ కుమార్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నరసాపురం రూరల్: నరసాపురం మండలం కె.బేతపూడి గ్రామంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శనివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామంలో రూ.20.8 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.14 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, రూ.13 లక్షలతో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

అతిరుద్ర మహాయాగ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు


కవిటంలో నిర్మించిన భారీ యాగశాల

పోడూరు: కవిటంలో శ్రీ సహస్ర చండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశ మహావిద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామ కూడలి సమీపంలో పాలకొల్లు-మార్టేరు రహదారి పక్కనే 10 ఎకరాల సువిశాలమైన ప్రదేశంలో పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామానికి చెందిన శ్రీ ఉమారామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు ఈ యాగ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 14 రోజుల పాటు జరిగే మహోత్సవాల్లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు, ప్రవచనకర్తలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసరాల వితరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రుకు చెందిన పాస్టర్ బి.చిరంజీవి పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. దీంతో పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోబేరు ఏసుకృపా శ్యాంసన్ స్పందించి నెలకు సరిపడా నిత్యావసరాలను శుక్రవారం పాస్టర్‌కు అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.రాజు, మట్టా జాన్ మోషే, పి.ఇశ్రాయేలు, ఎస్.నానిబాబు, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.